www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 70 | హైదరాబాద్ | గురువారం | 29-05-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## జైహింద్ యాత్రను విజయవంతం చేయండి

**హైదరాబాద్ మే 26(ప్రజాక్షేత్రం):**

జైహింద్ యాత్ర ర్యాలీని విజయవంతం చేయండి అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాల నుండి కేజీఆర్ కన్వెన్షన్ వరకూ గురువారం జైహింద్ యాత్ర ర్యాలీ నిర్వహించనున్నారు.ఈ యాత్రకు సీఎం రేవంత్ రెడ్డి,ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ దీపా దాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు హాజరు కానున్నారు. ఈ ఏర్పాట్లు పరిశీలించేందుకు బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరై జిల్లా నాయకులతో సమావేశం అయ్యారు.

జైహింద్ యాత్ర ర్యాలీ అనంతరం ఏర్పాటు చేస్తున్న సభకు జనసమీకరణ భారీగా జరిగేలా చొరవ చూపాలని నాయకులను పీసీసీ అధ్యక్షుడు ఆదేశించారు.కార్యక్రమంలో ఏఐసీసీ నాయకుడు సంపత్ కుమార్, డీసీసీ



అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి భూపతి రెడ్డి,కొలన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు కొలన్ వీరేందర్ రెడ్డి, చిట్ల దివాకర్ తదితరులు ఉన్నారు.

## రైతులకు గుడ్‌న్యూస్..
## 51 కోట్లు విడుదల

వడగళ్ల వానలతో
5,528 ఎకరాల్లో పంట నష్టం
41,361 మంది రైతులు ప్రభావితం
రూ.51.528 కోట్లు
మంజూరు చేసిన ప్రభుత్వం



2

### రైతు భరోసాపై కీలక ప్రకటన..
### అకౌంట్లో డబ్బులు అప్పుడే..!

**ఆర్థిక సంక్షోభాన్ని దాటిన తెలంగాణ**
**రైతులకు రూ.33 వేల కోట్లు మద్దతు**
**దేశంలోనే అధికంగా ధాన్యం సేకరించిన**
**రాష్ట్రంగా తెలంగాణ : మంత్రి తుమ్మల**

2

## కాళేశ్వరం నోటీసులపై కేసీఆర్. హరీష్‌రావు మధ్య మంతనాలు..

**కమిషన్ నోటీసులపై**
**ముందస్తు**
**వ్యూహరచనలో కేసీఆర్**
**విజిలెన్స్, NDSA నివేదికలపై**
**సమగ్ర అవగాహన కోసం**
**హరీష్‌తో చర్చలు**
**ఇంజనీర్ల ఫోన్**
**సంభాషణలతో కమిషన్**
**విచారణకు ఏర్పాట్లు**



2

## ఐఏఎస్ బదిలీల జాబితా ఖరారు!

**ధ్రువీకరించిన సీఎంవో వర్గాలు** | **జూన్ 6 లోపు కలెక్టర్ల**
**నెల నుంచి ఊరిస్తున్న బదిలీలు** | **బదిలీలకు రంగం సిద్ధం**



2

# ఎన్డీఎస్ఏ నివేదిక కాదు
# ఎన్డీయే నివేదిక

**మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ నివేదిక బూటకమని తేలిపోయింది**
**ఎన్ని కుట్రలు సృష్టించినా ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుంది**
**కేసీఆర్ గారు దూరదృష్టి గల నాయకుడు**
**ఎన్డీఎస్ఏ నివేదికపై ఎక్స్‌లో కేటీఆర్ ట్వీట్**



2

# సీఎం పదవి ఆకాశం నుంచి ఊడిపడిందా?

కులం వల్ల ఎవరికి సమాజంలో గుర్తింపు రాలేదు..
15 నుంచి 25 ఏళ్ల వయస్సులో తప్పుదోవ పట్టొద్దు..
ప్రజా ప్రభుత్వంలో దళిత బిడ్డలకు పట్టంకట్టాం..
కులం వల్ల ఎవరికి గుర్తింపు రాలేదు: సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ మే 26(ప్రజాక్షేత్రం):**

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల చదువులు వద్దని కులవృత్తులు చేసుకోవాలని మాత్రమే గత పాలకులు భావించారని అందుకే దళితులు చెప్పులు కుట్టుకోవాలని, బలహీన వర్గాలు చేపలు పట్టాలని, ట్రైబల్స్ పందులు పెంచుకోవాలంటూ పథకాలు తెచ్చారు తప్ప మీకు చదువులు చెప్పిస్తాం, మీకు రాజ్యాధికారం ఇస్తాం, మీకు రాజ్యనిర్మాణంలో భాగస్వాములను చేస్తామని చెప్పలేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశపై గత ప్రభుత్వం నీళ్లు చల్లిందని ధ్వజమెత్తారు. మాజీ సీఎం తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరొ చోట పదవులు ఇచ్చుకున్నారు గానీ రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. పీజీలు చేసిన యువకులు జీవితంలో విలువైన కాలాన్ని కోల్పోయారన్నారు. ఎస్సీ గురుకులాల్లో టెన్త్, ఇంటర్ చదివి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థులకు ఇవాళ బంజారాహిల్స్ లోని బాబూ జగ్జీవన్ రామ్ భవన్ లో సీఎం బహుమతులు అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు హాజరైన ఈ కార్యక్రమంలో గత పాలకులపై సీఎం విమర్శలు గుప్పించారు.

**నోటికాడికి వచ్చిన ముద్ద లాగేసే కుట్ర:**

దాదాపు రూ. 25 వేల కోట్లు ఖర్చు పెట్టి రెసిడెన్షియల్ స్కూల్స్ కడుతుంటే ఇంత వెచ్చించి నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందా అని ఓ రాజకీయ పార్టీకి సంబంధించిన పత్రిక రాసిందని సీఎం అన్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగాలు

మిగతా 2వ పేజీలో

## నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం!

ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం
ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటం
అవార్డును గౌరవంగానే కాదు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం
పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటుంది



**హైదరాబాద్ మే 26(ప్రజాక్షేత్రం):**

వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు అని తెలిపారు. 1994లో ఉద్యమం మొదలైందని, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటమన్నారు. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం

మిగతా 2వ పేజీలో


## నక్సల్ రహితంగా బస్తర్

- **ఎల్‌డబ్ల్యూఈ జాబితా నుంచి బస్తర్ పేరు తొలగింపు**
- **ప్రస్తుతం ఈ ప్రదేశంలో శాంతి పునరుద్ధరణ**
- **ఇది బస్తర్‌కు ఒక చారిత్రాత్మక విజయం**

**ఛత్తీస్‌ఘఢ్ మే 26(ప్రజాక్షేత్రం):**

ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రం బస్తర్ జిల్లాను నక్సల్ ప్రభావిత ప్రాంతాల జాబితా నుంచి తొలగిస్తూ..

మిగతా 2వ పేజీలో



2

## ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం..

### హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు!

ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం
పండంటి మగబిడ్డకి జన్మనిచ్చిన కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సతీమణి
కొన్ని నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు




2

www.siddipetpower.com

WWW.SIDDIPETPOWER.COM

# నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికీ దక్కిన గౌరవం!

మొదటిపేజీ తరువాయి

సాధ్యమయిందన్నారు. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని మందకృష్ణ మాదిగ అన్నారు. మంగళవారం సాయంత్రం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన పద్మ పురస్కారాల రెండో విడత ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా మందకృష్ణ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు.

'పద్మశ్రీ పురస్కారం ఉద్యమానికి దక్కిన అభినందనలు. వ్యక్తిగతంగా నా పేరుతో పద్మశ్రీ వచ్చినా.. ఇది ఉద్యమకారులందరికి దక్కిన గౌరవం. సమాజంలో అన్ని వర్గాల అండదండలతోనే ఉద్యమం సాధ్యమయింది. 1994లో ఉద్యమం మొదలైంది, ఎమ్మార్పీఎస్‌ది ముప్పై ఏళ్ల పోరాటం. సుప్రీంకోర్టు సైతం ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఉద్యమ లక్ష్యం నెరవేరింది, కేంద్రం గుర్తింపు కూడా ఇచ్చింది. పద్మశ్రీ అవార్డును గౌరవంగానే కాదు బాధ్యతగా ఫీల్ అవుతున్నాం. ఇంకా పరిష్కారం కాని సమస్యల కోసం భవిష్యత్ ప్రయాణం ఉంటుంది. చట్టసభల్లో పరిష్కారం కావాల్సిన సమస్యలు ఉన్నాయి. రాజకీయాల్లోకి వచ్చినా కండువా మారదు. రాజకీయ చైతన్యం కోసం కూడా సిద్ధం అవుతాం. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతోనే మాదిగలకు అన్యాయం జరిగింది. ఏపీలో చంద్రబాబు నాయుడు మాదిగలకు ప్రాతినిధ్యం పెంచారు' అని మందకృష్ణమాదిగ అన్నారు.

# నక్సల్ రహితంగా బస్తర్

మొదటిపేజీ తరువాయి

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఇది ఛత్తీస్‌ఘఢ్ రాష్ట్రానికి, ముఖ్యంగా బస్తర్‌కు ఒక చారిత్రాత్మక విజయంగా పరిగణించబడుతుంది. గత కొన్ని ఏళ్లుగా భద్రతా దళాలు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ప్రజల ఉమ్మడి ప్రయత్నాల కారణంగా బస్తర్‌లో నక్సలైట్ల ఏరివేత సమర్థవంతంగా ముగిసింది. ఈ ప్రాంతంలో ప్రస్తుతం శాంతి పునరుద్ధరించబడింది.

ప్రస్తుతం బస్తర్ జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు నక్సలిజాన్ని రూపు మాపేందుకు సహాయపడ్డాయి. రోడ్డు నిర్మాణం, విద్య, ఆరోగ్య సేవలు, పరిపాలన క్రియాశీలత బస్తర్‌ను నక్సలిజం నుంచి బయటకు తీసుకురావడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయి. లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం జాబితా నుంచి ఈ జిల్లా పేరును తొలగించడంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు, అభివృద్ధికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. ఇది బస్తర్ ఇమేజ్‌ను మార్చడమే కాకుండా, ఉపాధి, పర్యాటక అవకాశాలను కూడా పెంచుతుంది. ఈ నిర్ణయం బస్తర్ ప్రజలకు గర్వకారణమని, రాబోయే కాలంలో శాశ్వత శాంతి, పురోగతి వైపు సాధిస్తుందని భావిస్తున్నారు.

.. గత నెలలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ప్రాంతం గురించి ప్రస్తావించారు. "బస్తర్‌లో బుల్లెట్లు, బాంబులు పేల్చిన రోజులు పోయాయి. నక్సలైట్ సోదరులు ఆయుధాలు విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని నేను కోరుతున్నాను. మీరు మా సొంత ప్రజలు. ఒక నక్సలైట్ చనిపోతే ఎవరూ సంతోషంగా ఉండరు. ఆయుధాలు పట్టడం ద్వారా మీరు మీ గిరిజన సోదరులు, సోదరీమణుల అభివృద్ధిని ఆపలేరు. అభివృద్ధి ప్రక్రియలో భాగమైన లొంగిపోయిన నక్సలైట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పూర్తి రక్షణ లభిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ ప్రాంతానికి అభివృద్ధి అవసర. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఐదేళ్లలో బస్తర్‌కు అన్నీ ఇవ్వాలని కోరుకుంటున్నారు. బస్తర్ 50 సంవత్సరాలుగా అభివృద్ధిని చూడలేదు. కానీ పిల్లలు పాఠశాలకు వెళ్లినప్పుడు, మండల్లలో ఆరోగ్య సౌకర్యాలు ఉన్నప్పుడు, ప్రతి వ్యక్తికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్య బీమా ఉన్నప్పుడు మాత్రమే ఇది జరుగుతుంది. అయితే ఇది బస్తర్ ప్రజలు వారి ఇళ్లను, గ్రామాలను నక్సలైట్ రహితంగా మార్చాలని నిర్ణయించుకున్నప్పుడే అభివృద్ధి జరుగుతుంది" అని అమిత్ షా పేర్కొన్నారు.

# ఎన్డీఎస్‌ఏ నివేదిక కాదు ఎన్డీయే నివేదిక

- మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్‌ఏ నివేదిక బూటకమని తేలిపోయింది
- ఎన్ని కుట్రలు సృష్టించినా ఎప్పటికీ వాస్తవమే నిలుస్తుంది
- కేసీఆర్ గారు దూరదృష్టి గల నాయకుడు
- ఎన్డీఎస్‌ఏ నివేదికపై ఎక్స్‌లో కేటీఆర్ ట్వీట్



హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్‌ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.

క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్‌ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు.

కేసీఆర్ పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం అత్యంత దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.

నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్ - బీజేపీ, ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్‌ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్‌ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో.. దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ - బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అని కేటీఆర్ అన్నారు. జై కిసాన్.. జై కాళేశ్వరం.. జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.



# సీఎం పదవి ఆకాశం నుంచి ఊడిపడిందా?

మొదటిపేజీ తరువాయి



భర్తీ చేసిందని అధికారంలోకి వచ్చిన తొలి యేడాదిలోనే ఇన్ని ఉద్యోగులు ఇచ్చిన ఏ ముఖ్యమంత్రి, ఏ ప్రభుత్వమైనా ఉంటే వారు విధించే ఏ శిక్షకైనా నేను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సిద్ధం అని చాలెంజ్ చేశారు. ఇంకా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువత సంఖ్య లక్షల్లో ఉంది. ఉద్యోగాల భర్తీ త్వరగా పూర్తయితే ఉద్యోగం రానివారు మరో పని చూసుకుంటారన్నారు. ఉద్యోగాల భర్తీ త్వరగా జరగకుండా కొందరు కుట్రలు చేస్తున్నారని, గత ప్రభుత్వంలో గ్రూప్ 1 పరీక్షలు పెట్టి వాటి ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లలో పల్లీ బఠాణీల్లా అమ్ముకుని వారికి కావాల్సిన వారినే పాస్ చేయించుకున్నారని ఆరోపించారు. అలాంటి వారిని అరెస్టు చేసి ఆ పరీక్షలను రద్దు చేసి కొత్త పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షలు, ఫలితాలు వెలువరించి నియామక పత్రాలు ఇద్దామనుకున్న సమయంలో కోర్టుల్లో రాజకీయ కేసులు వేసి ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. నోటికాడికి వచ్చిన ముద్ద లాక్కున్నట్లుగా కేసులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్స్ ఉద్యోగాల నియామకాలను పారదర్శకంగా నిర్వహిస్తుంటే గతంలో పదేళ్లు పరీక్షలు నిర్వహిచని పార్టీలో ఇవాళ నియామకాలను అడ్డుకోవాలని చూస్తున్నాయన్నారు. ఉద్యోగాలకు అడ్డుకుంటున్న వారిని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు. సివిల్స్ మెయిన్స్ కు ఎంపికైన వారికి లక్ష రూపాయలు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీల్లో ఈ ఏడాది లక్ష ఉద్యోగాలు ఇచ్చాం.అయినా ఇవి సరిపోదన్నారు.

**సీఎం పదవి ఆకాశం నుంచి ఊడిపడలేదు:**

గత పదేళ్లు ముఖ్యమంత్రి ఎవరిని కలవలేదు. కానీ నేను అనునిత్యం మీకు అందుబాటులోనే ఉంటున్నాను. ఇది ప్రజాపాలనకు, దొరల పాలనకు ఇది తేడా అన్నారు. ముఖ్యమంత్రి అంటే ఆకాశం నుంచి ఊడిపడిన పదవి కాదు. అది అన్నివర్గాల ప్రజలు ఆశీర్వదించి ఇస్తే ఈ పదవి వస్తుందన్నారు. అందుకే మీ మధ్యలో ఉండి మీతో ఆలోచనలు పంచుకోవాలనుకుంటున్నన్నారు. సమాజంలోని అసమానతలు, రుగ్మతలను తొలగించి సమ సమాజాన్ని నిర్మించేందుకు పాటుపడిన వారు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని అలాంటి వారి స్ఫూర్తితో ఈ ప్రభుత్వం ఏర్పడిందని సీఎం చెప్పారు. పాలితులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తుంటున్నామన్నారు. చాలా మంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదని చదువు మాత్రమేనన్నారు. బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని విద్యార్థులకు చదువు ఒక్కటై ఏకైక లక్ష్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు విడివిడిగా రెసిడెన్షియ్ స్కూల్స్ పెట్టడం ద్వారా విద్యార్థులలో ఆత్మన్యూనత భావం ఏర్పడుతుందన్నారు. దీనిపై ఆలోచన చేసి రాష్ట్ర ప్రభుత్వం ఈ దేశానికే ఆదర్శంగా ఉండేలా యంగ్ ఇండియా ఇండిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ విధానం తీసుకువచ్చామన్నారు. గతంలో ఎన్నడూ రాని అవాకాశాలను దళితులకు ఈ ప్రభుత్వ కల్పించిందన్నారు.

# ఐఏఎస్ బదిలీల జాబితా ఖరారు!

- నెల నుంచి ఊరిస్తున్న బదిలీలు
- జూన్ 6 లోపు కలెక్టర్ల బదిలీలకు రంగం సిద్ధం

హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

ఐఏఎస్‌ల బదిలీలపై నెల రోజులుగా కొనసాగుతున్న అనిశ్చితి ఒక కొలిక్కి వచ్చినట్టు తెలుస్తున్నది. వచ్చే నెల మొదటి వారంలో ఎప్పుడైనా కలెక్టర్ల బదిలీలు ఉండవచ్చని సీఎంవో వర్గాలు ధ్రువీకరించాయి. మే నెల మొదటి వారంలోనే కొన్ని ప్రధాన శాఖల హెచ్‌వోడీలు, జిల్లా కలెక్టర్ల బదిలీలు జరుగుతాయని, జాబితా కూడా సిద్ధమైందని సీఎంవో నుంచే లీకులు వచ్చాయి. కొత్త సీఎస్ బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఐఏఎస్‌ల బదిలీలు ఇక లాంఛనమే అనే ప్రచారం జరిగింది. తెరవెనుక ఏం జరిగిందో ఏమో గానీ ఐఏఎస్‌ల బదిలీలకు బ్రేక్ పడింది. మరోవైపు బదిలీ తప్పదనుకున్న అధికారులు అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా వదిలేసినట్టు జిల్లా యంత్రాంగంలో చర్చ జరుగుతున్నది.

**సీఎం వర్సెస్ మంత్రులు**

సీఎం, మంత్రుల మధ్య నెలకొన్న అగాధమే ఐఏఎస్‌ల బదిలీల బ్రేక్‌కు కారణం అని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌ను పూర్తిగా గుప్పిట్లో పెట్టుకోవాలనే ఆలోచనతో సీఎంవో కసరత్తు చేసినట్టు తెలిసింది. తమ ఆధీనంలో ఉండి పనిచేసే కలెక్టర్లను ఏరికోరి పోస్టింగుల్లో సర్దుబాటు చేసినట్టు, రాష్ట్రంలో ఏ మూలన చీమ చిటుక్కుమన్నా.. క్షణాల మీద సీఎంవోకు సమాచారం చేరవేసేంత విధేయత ఉన్న అధికారులతో జాబితా రూపొందించినట్టు సమాచారం. ఈ జాబితాకే సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఈ జాబితాలోని పేర్లు బయటికి పొక్కడంతో మంత్రులు తీవ్ర ఆభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం. తమ ప్రమేయం లేకుండా కలెక్టర్ల పోస్టింగు మీద ఎలా నిర్ణయం తీసుకుంటారని వారు ఎదురుతిరిగినట్టు తెలిసింది. దక్షిణ తెలంగాణలోని ఒక కలెక్టర్‌పై అవినీతి ఆరోపణలు వచ్చినప్పటికీ బదిలీల జాబితాలో సదరు వ్యక్తి పేరు లేకపోవడంతో అక్కడి నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

**15 జిల్లాల కలెక్టర్ల మీద నేతల ఫిర్యాదు**

ప్రస్తుతం 15 జిల్లాల కలెక్టర్ల మీద మంత్రులు, ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ ఫిర్యాదుల ఆధారంగానే సీఎంవో ఈ 15 మందితో పాటు, 12 మంది అదనపు కలెక్టర్లను, 10 మంది జాయింట్ కలెక్టర్లను బదిలీ చేస్తూ లిస్టు ఫైనల్ చేసినట్టు సమాచారం. నేతల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న సీఎంవో.. వారి అభిప్రాయాలు తెలుసుకోకుండా జాబితా రూపొందించినట్టు ప్రచారం జరుగుతున్నది. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎదురు తిరిగినట్టు సమాచారం. ఈ పరిస్థితిపై డోలాయమానంలో పడిన సీఎం ఇప్పటికే ఉన్న విభేదాలు మరింత పెరుగుతాయేమోనన్న ఆందోళనతో ఉన్నట్టు తెలిసింది. పోనీ మంత్రులు సూచించిన పేర్లతో బదిలీలు చేస్తే పాలనా వ్యవస్థ చేజారిపోతుందమోనని సీఎంవో భావిస్తున్నట్టు సమాచారం. సదరు అధికారులు తన మాట కాకుండా మంత్రుల మాటకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంటుందని, అప్పుడు మరింత ఇబ్బంది ఏర్పడుతుందనే ఆలోచనలో సీఎం ఉన్నట్టు చెప్పుకుంటున్నారు.

**జిల్లాల సర్దుబాటుతో సమస్య కొలిక్కి..**

ఆయా మంత్రుల అభిప్రాయం మేరకు.. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జిల్లాలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎంవో సూచించిన బదిలీలతో తుది జాబితా రూపొందించినట్టు తెలిసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, హన్మకొండ, ఖమ్మం తదితర జిల్లాల కలెక్టర్ల బదిలీలపై క్లారిటీ వచ్చినట్టు సీఎంవో వర్గాలు చెప్తున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో ఇద్దరు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇద్దరు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్కరు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఒకరు, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి ఇద్దరేసి చొప్పున కలెక్టర్లు, ఆ కింది స్థాయి అధికారులు బదిలీ అయ్యే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. జూన్ 6 లోపు కలెక్టర్ల బదిలీల ప్రక్రియ పూర్తిచేయాలని, ఇప్పుడు బదిలీ చేస్తే మళ్లీ ఏడాది, ఏడాదిన్నర వరకు ట్రాన్స్‌ఫర్ల జోలికి వెళ్లకుండా.. పూర్తిగా పాలనపైనే ఫోకస్ పెట్టే విధంగా కసరత్తు ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు తెలిసింది.

# కాళేశ్వరం నోటీసులపై కేసీఆర్, హరీష్‌రావు మధ్య మంతనాలు..

- కమిషన్ నోటీసులపై ముందస్తు వ్యూహరచనలో కేసీఆర్
- విజిలెన్స్, NDSA నివేదికలపై సమగ్ర అవగాహన కోసం హరీష్‌తో చర్చలు
- ఇంజనీర్ల ఫోన్ సంభాషణలతో కమిషన్ విచారణకు ఏర్పాట్లు



హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు మూడున్నర గంటలగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న కమిషన్ ఇచ్చిన నివేదిక, అందించిన నోటీసులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 5న కమిషన్ ముందు విచారణకు హాజరుకానున్నట్లు ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేసీఆర్, ముందు జాగ్రత్తగా కమిషన్ వద్ద ఉత్పన్నమయ్యే ప్రశ్నలు, వాటికి ఇవ్వాల్సిన సమాధానాలపై హరీష్‌రావుతో తగినంత సమాలోచనలు జరిపినట్లు సమాచారం.

విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న అంశాలు, ఎక్కడా లోపాలు జరిగాయన్న విషయాలపై పూర్తిగా ఆరా తీసినట్లు, ఇది కాకుండా, (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) ఏం సూచించింది? బ్యారేజీ కుంగడపై సాంకేతిక కారణాలు ఏమిటన్న దానిపై పూర్తి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కమిషన్ ఎదుట హాజరైన కొంతమంది రిటైర్డ్ ఇంజనీర్లతో కేసీఆర్ ఫోన్ ద్వారా మాట్లాడినట్లు, కమిషన్ అడిగిన ప్రశ్నలు ఏమిటి? ఇంజనీర్లు ఇచ్చిన సమాధానాలు ఎలా ఉన్నాయన్న విషయాలపై కూడా ఆయన చర్చించినట్లు సమాచారం.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం..

- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు!
- ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం
- పండండి మగ బిడ్డకి జన్మనిచ్చిన కొత్తగూడెం జిల్లా కలెక్టర్ సతీమణి
- కొన్ని నెలలుగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు
- ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం.. హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు!

హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స, ప్రసవం అంటే చాలా మంది భయపడిపోతుంటారు. ప్రభుత్వ వైద్యంపై ఇప్పటికీ కొందరిలో చిన్న చూపు కూడా ఉంది. అక్కడ వైద్య సౌకర్యాలు సరిగా ఉండవని, డాక్టర్లు సరిగా పట్టించుకోరని జనాలు అంటుంటారు. అయితే కొందరు ఉన్నతాధికారులు ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించేందుకు కృషి చేస్తుంటారు. తాజాగా ఓ జిల్లా కలెక్టర్ తన భార్య ప్రసవంను ప్రభుత్వ ఆసుపత్రిలో చేపించి.. జనాల్లో నమ్మకం పెంచే ప్రయత్నం చేశారు.

పాల్వంచ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జీతేష్ వి పాటిల్ సతీమణి శ్రద్ధ జీతేష్ వి పాటిల్ బుధవారం ప్రసవించారు. కలెక్టర్ సతీమణి పండండి మగ బిడ్డకి జన్మనిచ్చారు. తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్లు చెప్పారు. కలెక్టర్ సతీమణి గత కొన్ని నెలలుగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే పరీక్షలు చేయించుకున్నారు. కలెక్టర్ సతీమణి తొలి కాన్పులో కూడా మగ బిడ్డకు జన్మనిచ్చారు. కలెక్టర్ స్థాయిలో ఉండి కూడా ప్రభుత్వ ఆసుపత్రిలో సతీమణికి ప్రసవం చేయించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ చాలా మందికి ఆదర్శం అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# రైతు భరోసాపై కీలక ప్రకటన.. అకౌంట్లో డబ్బులు అప్పుడే.!

- ఆర్థిక సంక్షోభాన్ని దాటిన తెలంగాణ
- రైతులకు రూ.33 వేల కోట్లు మద్దతు
- దేశంలోనే అధికంగా ధాన్యం సేకరించిన రాష్ట్రంగా తెలంగాణ : మంత్రి తుమ్మల

హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

త్వరలోనే రైతులకు మంచి రోజులు రాబోతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ రాష్ట్రం చిన్నదైనా, కొత్తదైనా ఆర్థికంగా ఎదురైన సమస్యలను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. ఆర్థిక బాధ్యతల మధ్యలోనే సీఎం రుణమాఫీ చేసినట్టు పేర్కొన్నారు. గత ఏడాది ఖరీఫ్ పంట కాలంలో రైతుల ఖాతాల్లో ఏకంగా రూ.33,000 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. దేశంలో అత్యధికంగా ధాన్యం సేకరించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. రైతులకు "రైతు భరోసా" నిధులు అనుకున్న సమయంలో అందిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా, నల్గొండ జిల్లాలో పామాయిల్ పరిశ్రమ నిర్మాణం తుది దశకు చేరుకుందని, త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు.

# రైతులకు గుడ్‌న్యూస్.. 51 కోట్లు విడుదల

- వడగళ్ల వానలతో 5,528 ఎకరాల్లో పంట నష్టం
- 41,361 మంది రైతులు ప్రభావితం
- రూ.51.528 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

హైదరాబాద్ మే 28(సిద్దిపేట పవర్):

రాష్ట్రంలో ఇటీవల కురిసిన వడగళ్ల వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో పంటలకు భారీ నష్టం సంభవించిన విషయం తెలిసిందే. తాజాగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. రాష్ట్రంలోని 29 జిల్లాల్లో 41,361 మంది రైతులకు సంబంధించిన సుమారు 5,528 ఎకరాల పంటలు వర్షాల కారణంగా నష్టపోయాయని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం బుధవారం రూ.51.528 కోట్ల నిధులను మంజూరు చేసింది.

ఈ నిధులను సంబంధిత విభాగాలతో సమన్వయం చేసి, త్వరలోనే నష్టపోయిన రైతుల ఖాతాల్లో జమ చేయడం కోసం చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. వివిధ పంటల నష్టాన్ని పరిశీలిస్తే, రాష్ట్ర వ్యాప్తంగా వరి పంట 36,424 ఎకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, ప్రత్తి 4,753 ఎకరాలు, ఇతర పంటలు 477 ఎకరాలలో వర్షాల కారణంగా నష్టం ఏర్పడినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.





## ఘనంగా స్వర్గీయ ఎన్టీ రామారావు 102 జయంతి

**గజ్వేల్ టీడీపీ అధ్యక్షుడు సీతారామూర్తి**


**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** :గజ్వేల్ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు 102 వ జయంతి ఎన్టీ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా గజ్వేల్ నియోజకవర్గం కమ్మ సంఘం తెలుగుదేశం కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు ఎన లేని సేవలు చేశారాని యువత అయన అడుగు జాడల్లో నడవాలని అయన పటేల్ పట్వారి వ్యవస్థ నుండి మండలాలు నెలకొల్పి సామాన్య ప్రజలను విముక్తి చేశారాని తెలిపారు. సామాన్య ప్రజల్లో రెండు రూపాయలకె కిలో బియ్యం చేసి ప్రజల గుండెల్లో మహనీయులు నిలిచి పోయారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల టిడిపి అధ్యక్షుడు నల్ల సీతారామమూర్తి ఉపాధ్యక్షులు మోచిప్రభాకర్. ప్రధాన కార్యదర్శి వేముల వేణుగోపాల్ రాచకొండ నర్సింలు కార్యనిర్వాహ కార్యదర్శిలు అంజన మహేష్ గౌడ్ రాచకొండ శ్రీనివాస్ మల్కాపల్లి కరుణాకర్ గుండేటి మల్లేశం తోట యోగరాజు వేముల రాజు మరియు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ కమ సంఘం నాయకులు వేముల వెంకటేశ్వరరావు మినగంటి ప్రసాద్ చాగంటి వెంకట్రావు కె. నారాయణస్వామి వేముల శ్రీనివాసరావు వేముల వేణుగోపాలరావు. కే మట్ట



## సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరం

**దుబ్బాక సిద్దిపేట్ పవర్ మే 28 న్యూస్**

సీఎంఆర్ఎఫ్ చెక్కులు నిరుపేదలకు వరమని బీజేపీ దుబ్బాక మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. బుధవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశాల మేరకు పట్టణంలోని 14,15 వార్డ్ లో సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను కడవేర్గు మాధురి , నస్రీన్ బేగం, మల్లుగారి భవ్యలకు రూ.51000/పంపిణీ చేశారు ఈ కార్యక్రమం లో దుబ్బాక దిశా కమిటీ మెంబర్ సుంకోజు ప్రవీణ్ చారి,బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షులు మల్లుగారి రమణ రెడ్డి , బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తొగుట రవీందర్ , జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రమేష్‌రెడ్డి,ఇస్తారిగల్ల యాదగిరి,భరత్ చారి,మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా స్వర్గీయ ఎన్టీ రామారావు 102 జయంతి

**గజ్వేల్ టీడీపీ అధ్యక్షులు రాము**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం** :గజ్వేల్ పట్టణంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు 102 వ జయంతి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా గజ్వేల్ నియోజకవర్గం కమ్మ సంఘం తెలుగుదేశం కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి ఉత్సవాలను జరుపుకున్నారు. ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు తెలుగు ప్రజలకు ఎన లేని సేవలు చేశారాని యువత అయన అడుగు జాడల్లో నడవాలని అయన పటేల్ పట్వారి వ్యవస్థ నుండి మండలాలు నెలకొల్పి సామాన్య ప్రజలను విముక్తి చేశారాని తెలిపారు. సామాన్య ప్రజల్లో రెండు రూపాయలకె కిలో బియ్యం చేసి ప్రజల గుండెల్లో మహనీయులు నిలిచి పోయారని తెలిపారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల టిడిపి అధ్యక్షుడు నల్ల సీతారామమూర్తి ఉపాధ్యక్షులు మోచిప్రభాకర్. ప్రధాన కార్యదర్శి వేముల వేణుగోపాల్ రాచకొండ నర్సింలు కార్యనిర్వాహ కార్యదర్శిలు అంజన మహేష్ గౌడ్ రాచకొండ శ్రీనివాస్ మల్కాపల్లి కరుణాకర్ గుండేటి మల్లేశం తోట యోగరాజు వేముల రాజు మరియు గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గ కమ సంఘం నాయకులు వేముల వెంకటేశ్వరరావు మినగంటి ప్రసాద్ చాగంటి వెంకట్రావు కె. నారాయణస్వామి వేముల శ్రీనివాసరావు వేముల వేణుగోపాలరావు. కే మట్టయ్య కోటేశ్వరరావు నల్ల రామ్మూర్తి పరుచూరి రాజు తదితరులు పాల్గొన్నారు.





# ప్రత్యేక అధికారుల పాలనలో పడకేసిన పారిశుధ్యం

- ప్రభుత్వాన్నిదా లేక అధికారుల తప్ప
- జగదేవపూర్ మేజర్ గ్రామపంచాయతీ సంవత్సరానికి ఆదాయం ఒక కోటి నుండి 2 కోట్ల వరకు
- మెయిన్ రోడ్డు పైన మురికి కాలువ
- ప్రజలు సమస్య అడిగిన ప్రభుత్వ ఖజానా ఖాళీ ఉంది అంటారు తప్ప

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** జగదేవపూర్ మండల కేంద్రంలో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుద్ధ్యం పడకేసిందని ప్రజలు వాపోయారు. మండల కేంద్రంలోని వినాయక టెంపుల్ నుండి గాంధీ చౌరస్తా వరకు ఓపెన్ గా మురికి కాలువ పారుతున్న గాని అధికారులు పట్టి ముట్ట రానట్టుగా చూసి చూడనట్టుగా ఉంటున్నారని ప్రజలు మండిపడ్డారు. ఈ విషయమై విన్నవించుకున్నా గాని గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలకు మా అధికారుల మీద నెట్టేస్తున్నారని సామాన్య ప్రజలు చెప్పినా పెడచెవిన పెడుతున్నారని వాపోయారు.అలాగే వర్షాకాలం ప్రారంభమైన బ్లీచింగ్ పౌడర్ కూడా దిక్కులేని పరిస్థితుల్లో ఉందని వాపోయారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ బకాయి బిల్లులు ఈ మధ్యకాలంలో 153 కోట్ల రూపాయలు విడుదల చేసిన ప్రభుత్వాన్ని డబ్బులు లేక ఖజానా ఖాళీ అయిందని ఎవరు అడిగినా అదే మాట పలుమార్లు ప్రజలకు చెప్పడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా జగదేవపూర్ మండలం మూడు జిల్లాల సరిహద్దు అయిన గ్రామపంచాయతీ కాబట్టి అటు యాదాద్రి భువనగిరి జిల్లా వరంగల్ నల్లగొండ సిద్దిపేట జిల్లాలో సరిహద్దు ప్రజల అవసరం నిమిత్తము మండలానికి వస్తు పోతుంటారని కూరగాయలు సంతా సమయంలో కనీస మరుగుదొడ్లు కూడా కరువయ్యాయని ఈ విషయమై పలుమాలు చెప్పిన అధికారులకు పెడచెవిన పెడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

## గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయవాది": వీర్ సావర్కర్.

**సిద్దిపేట పవర్:**

స్వాతంత్ర వీరసావర్కర్ ను బ్రిటిష్‌వారు హింసించగలిగారు గాని తనలో దేశభక్తిని ఏమాత్రం తగ్గించలేకపోయారని బిజెపి పట్టణ అధ్యక్షుడు బాసం గారి వెంకట్ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో వీర సావర్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని ఆయన విగ్రహానికి బిజెపి నాయకులతో కలిసి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ స్వతంత్ర కోసం తన జీవిత కాలం మొత్తం జైల్లోనే గడిపిన చరిత్ర వీర సావర్కర్ కు ఉందన్నారు. సవర్కర్ వంటి దేశభక్తుల పోరాటం ఫలితంగానే దేశానికి స్వాతంత్రం సిద్ధించిందని తెలిపారు. నేటి తరం యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కసనగొట్టు సంతోష్ అంబటిపల్లి శ్రీనివాస్ ధాబా నరేష్ కెమ్మసరం సంతోష్ బొడ్డు సునీల్ రాధిక గందె సంతోష్ భోగి శ్రీను వేణు మోతుకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## మలబార్ గోల్డ్ సంస్థ 'వరల్డ్ హంగర్ డే'నూతన పథకం ప్రారంభం

**నిరుపేదలకు2.50కోట్ల ఉచితంగా భోజనాలకు కేటాయింపు**

**సిద్దిపేట మే28** వరల్డ్ హంగర్ డే' సందర్భంగా, భారతదేశం మరియు జాంబియా దేశాల్లో ప్రతిరోజూ 70,000 వరకు నిరుపేదలకు ఉచిత భోజనాలు పంపిణీ చేయాలని నిర్ణయించిందని సిద్దిపేట మలబార్ గోల్డ్ షోరూం లో గజ్వేల్ ఎమ్మార్వో శ్రావణ్ కుమార్, సిద్దిపేట సిటిజన్ క్లబ్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పోస్టర్ విడుదల చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలబార్ 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకంలో భాగంగా 202526 సంవత్సరంలో మొత్తం 2.50 కోట్ల భోజనాలు ఉచితంగా అందించాలనే ఉద్దేశ్యం తో ఉచిత భోజనాల పేరుతో 'హంగర్ ఫ్రీ వరల్డ్' పథకం ప్రారంభించామని ఈ పథకం ప్రారంభించినప్పటి నుండి, గత 3 ఏళ్లలో, 2.5 కోట్ల భోజనాలు



నిరుపేదలకు అందించబడ్డాయని తమ వార్షిక సి.ఎస్.ఆర్ బడ్జెట్‌లో 60 శాతం నిధులను, నిరుపేదల ఆకలి తీర్చడం మరియు పేదరికాన్ని నిర్మూలించడానికి ఉద్దేశించిన కార్యక్రమాల కోసం మలబార్ గ్రూప్ కేటాయించింది. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి చేయాలనే మలబార్ గ్రూపు నిబద్ధతను బలోపేతం చేస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో డైరెక్టర్ షరిక్ షరాఫ్, మేనేజర్ శివ, మార్కెటింగ్ మేనేజర్ వజీద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రత్యేక కోటా

**బడిబాట ప్రచార జాతను ప్రారంభించిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**సిద్దిపేటమే28**

బాయిలర్ కోడికి, ఊరి కోడికి ఉన్న తేడా ప్రైవేట్ పాఠశాలలకు ,ప్రభుత్వ పాఠశాలకు ఉందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు..సిద్దిపేట జిల్లా కేంద్రంలోనీ ఇంద్ర నగర్ పాఠశాలలో టి.ఎస్. యూ.టి.ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బడిబాట ప్రచార జాత ను డి ఇ ఓ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్సీ అంజిరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం, నాలెడ్జి ఎక్కువగా లభిస్తుందని, ప్రైవేట్ పాఠశాలల్లో బట్టి కొట్టే విధానం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా ఇంగ్లీష్ మీడియం లో విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు.. ప్రైవేట్ పాఠశాలలో విద్య ఖర్చుతో కూడుకున్నదని.. ప్రభుత్వ పాఠశాలల్లో పుస్తకాలు నోట్ బుక్స్ యూనిఫామ్ తో సహా ఉచితంగా అందిస్తున్నామన్నారు.రానున్న రోజుల్లో అన్ని ప్రభుత్వ ఉద్యోగ అవకాశాల తో పాటు విద్యా అవకాశాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ప్రత్యేక కోటా ఉండేలా శాసనమండలిలో మాట్లాడుతానన్నారు.. డిఇఓ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇలా ప్రచార రథం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను పెంచేందుకు కృషి చేయడం అభినందనీయం అన్నారు.. అందుకు టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర బాధ్యులను జిల్లా బాధ్యులను అభినందిస్తున్నామని తెలిపారు..ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు రాజ ప్రభాకర్ రెడ్డి, రాజిరెడ్డి, టిఎస్ యుటిఎఫ్ నాయకులు యాదగిరి, కృష్ణ, కనకరాజు పాల్గొన్నారు..





## కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఆకర్షతులై భారీ సంఖ్య లో చేరుకలు

- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వం
- సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ

**సిద్దిపేట పవర్;**

సిద్దిపేట నియోజకవర్గం అర్బన్ మండలం నుండి నారాయణ రావు మండలం నుండి 200 మంది బి ఆర్ స్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు,. ఈ రోజు వారికి సిద్దిపేట నియోజకవర్గ క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ ఇంచార్జి హరి కృష్ణ సాధారంగా ఆహ్వానిస్తూ వారికి కాంగ్రెస్ పార్టీ కండువా లు కప్పీ పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెపుడుతున్న సంక్షేమ పథకాలు చూసి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న గ్రామాల లో చేస్తున్న అభివృద్ధి చూసి రేవంత్ అన్న ప్రభుత్వం చేస్తున్న ప్రజా పాలన ను ఆకర్షతులయి కాంగ్రెస్ పార్టీ లోకి అధిక సంఖ్య లో చేరుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజల ల లోకి తీసుక పోవాలని అర్హులకు సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేయాలనీ కోరారు, ఈ కార్యక్రమం లో నారాయణ రావు పేట మండలం గోపుల పూర్ గ్రామం నుండి 50 మంది బి ఆర్ స్ కార్యకర్తలు డీసీసీ ఉపాధ్యక్షులు మంద పాండు, బాబీష్, గ్రామ అధ్యక్షులు దేవయ్య ఆధ్వర్యంలో చేరారు, అలాగే అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామం నుండి బొగ్గులోని బండ నుండి 150 మంది బి ఆర్ స్ నుండి కాంగ్రెస్ పార్టీ లోకి మిట్టపల్లి గ్రామ అధ్యక్షులు బత్తిని నవీన్ గౌడ్ ఆధ్వర్యంలో చేరారు. చేరిన వారిలో గోపులా పూర్ గ్రామం నుండి సిలాపురం అంజయ్య సిలాపురం శీను రెబ్బల దేవయ్య నరేందర్ శీను పరస దేవయ్య మల్లయ్య ఎలుక పల్లి జైపాల్ ఎల్లయ్య సుప్పరి సుధాకర్ బోయిని రాజు యాట యాదయ్య బచ్చపల్లి రాములు జనగాం అంజనేయులు ధరణి రాజు మల్లేశం పర్వతం రమేష్ చిన్న రమేష్ ఏదుల నరేష్ యాదయ్య అరవింద్ కార్తీక్ నవీన్ మిట్టపల్లి గ్రామం నుండి రాకేష్, అఖిల్ శ్రీధర్, భాస్కర్ అనీల్ తదితరులు చేరారు





## కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**చేర్యాల, మే 28 (సిద్దిపేట పవర్)** చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకులు మెరుగు శ్రీధర్ తండ్రి గారు మెరుగు శ్రీరాములు గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నేడు మృతి చెందడం జరిగింది,అది తెలుసుకున్న జనగామ జిల్లా పార్టీ అధ్యక్షులు జనగామ నియోజకవర్గం ఇంచార్జి & మాజీ శాసనసభ్యులు కొమ్మూరు ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షులు కొమ్ము రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంజ మల్లేశం, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ కృష్ణన్, నల్ల పోచమ్మ టెంపుల్ చైర్మన్ గూడెం మహేష్ యువజన కాంగ్రెస్ మండల నాయకులు ఆరుట్ల వినీత్ బాబు గార్లతో కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం కింద 5000 రూపాయలు అందించడం జరిగింది..ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు తాళ్లపల్లి రమేష్ మరియు గ్రామ శాఖ అధ్యక్షులు బాగోతం బాల చంద్రం, కొమ్మునేని భూషయ్య, గదరాజు సుదర్శన్, నీరటి మహేందర్, గదరాజు నరేష్, కొమ్ముల మధు, ఆరుట్ల శ్రవణ్ మరియు తదితరులు పాల్గొన్నారు




# ఏసీపీ కె. నర్సిములును శాలువాతో సన్మానించిన సిపిఐ దయానంద్ రెడ్డి

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ నూతన ఏసీపీ బాధ్యతలు చేపట్టిన ఏసీపీ కే. నర్సిములును శాలువాతో సిపిఐ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు దయానంద్ రెడ్డి సన్మానంచారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రజలకు సేవలు అందించి మంచి మన్నలు పొందాలని తెలిపారు.

# దొంగబాబా ఆటకట్టు

**24 గంటల్లో కేసు ఛేదించిన నాగోల్ పోలీసులు**

**సిద్దిపేట పవర్ నాగోల్(మే 28):**

దొంగబాబా కేసును 24 గంటల్లోనే నాగోల్ పోలీసులు ఛేదించారు. జ్యోతిష్యం పేరుతో ఒక మహిళను నమ్మించి, బంగారం కాజేసిన వ్యక్తిని నాగోల్ సీఐ సూర్య నాయక్ బృందం అదుపులోకి తీసుకుంది. అతని నుంచి బంగారు నల్లపూసల గొలుసు రికవరీ చేసింది. 33 ఏళ్ల నిందితుడు సిరిగిరి సాయి కుమార్ అలియాస్ సాయిరాజ్ మేడిపల్లిలోని బోడుప్పల్‌లో నివసిస్తాడని పోలీసులు తెలిపారు. ఈ కేసు ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సూర్య నాయక్ బృందాన్ని ఉన్నతాధికారులు ప్రశంసించారు. బృందంలో ఎస్ఐ పి.శివనాగ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ షంషుద్దీన్, కానిస్టేబుళ్లు పవన్, సీహెచ్. ప్రవీణ్ కుమార్‌ను ఎల్బీ నగర్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ ఎ.కృష్ణయ్య ప్రత్యేకంగా అభినందించారు.




# నైపుణ్యం.. ఉపాధికి ప్రోత్సాహం



**సంగారెడ్డి టౌన్, సిద్దిపేట, మెదక్, కలెక్టరేట్:**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యం ఎంతో అవసరం. రంగమేదైనా.. తనదైన ప్రతిభ కలిగి ఉంటే ముందడుగు వేయొచ్చనేది నిపుణుల మాట. విద్యాభ్యాసం పూర్తి చేసి పట్టా చేతికొచ్చాక పరిజ్ఞానం, శిక్షణ తప్పని సరి. ప్రస్తుతం అందరికీ ఉద్యోగాలు గగనంగా మారిన నేపథ్యంలో యువతను స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 'రేసింగ్ అండ్ యాక్సలరేటింగ్ ఎంఎస్ఎంఈ ఫర్‌పార్మెన్స్ (ర్యాంప్)' పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వనుండటం విశేషం.

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని జనాభాలో సింహభాగం యువతే. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి సాధించింది. మెదక్‌లో వందలాది పరిశ్రమలు ఉండగా, సిద్దిపేట జిల్లాలో వాటి ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో మైనింగ్ ఆధారిత పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం శిక్షణ ఇస్తే నాలుగు జిల్లాల్లోని యువతకు ప్రయోజనం చేకూరనుంది. ఈ మేరకు ఆయా జిల్లాల పరిశ్రమల కేంద్రాల్లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది.

**పథకాలపై అవగాహన**

కేంద్ర ప్రభుత్వం చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. రాయితీ పథకాలను సైతం అమలుచేస్తోంది. గరిష్ఠంగా రూ.50 లక్షల యూనిట్ వరకు సాయం అందిస్తోంది. ఇలాంటి పథకాలపై అవగాహన లేక యువత సద్వినియోగం చేసుకోలేకపోతోంది. పరిశ్రమల కేంద్రంలో ఏర్పాటుచేసే శిక్షణ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు వీటిపై అవగాహన కల్పించనున్నారు. యూనిట్లను బట్టి ఉండే రాయితీ, బ్యాంకు రుణాలు పొందే మార్గాలను వివరిస్తారు.

పథకాలకు ఎవరు అర్హులు, యూనిట్ ఎంపిక, ప్రాజెక్టు నివేదిక రూపొందించే తీరు, అమలుతీరు తదితర అంశాలను వివరిస్తారు. యూనిట్లు నెలకొల్పి మరికొంత మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రోత్సహించనున్నారు. నిపుణులతో శిక్షణ ఇవ్వనున్నారు.

**ఆసక్తి ఉన్న వారికి..**

చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పే ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికంటే ముందు శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయనుంది. సదరు కేంద్రాల్లో మేనేజర్, సహాయ మేనేజర్లు ఉంటారు. ఉన్నతాధికారుల నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తారు. దీనికి ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేస్తారు. ఇప్పటికే మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. అర్హులను ఎంపిక చేసి పోస్టింగులు ఇవ్వనున్నారు.

**మార్గదర్శకాలు రాగానే..: తుల్జానాయక్, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్**

శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి మార్గదర్శకాలు అందాల్సి ఉంది. కేంద్రాల నిర్వహణకు మేనేజర్, సహాయ మేనేజర్ల నియామకాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వం నుంచి వచ్చే ఉత్తర్వులకు అనుగుణంగా ముందుకు సాగుతాం.

# సాలరీల్లేవు.. సర్టిఫికెట్లు రావు !.. మల్లన్నసాగర్ నిర్వాసితులకు కొత్త కష్టాలు..!!

- ఏడు గ్రామాలను డీ నోటిఫై చేసిన ప్రభుత్వం
- గజ్వేల్ మండలంలో గానీ, మున్సిపాలిటీలోగానీ విలీనం చేయకపోవడంతో నిలిచిన సర్టిఫికెట్ల జారీ
- పెండింగ్‌లో పడిన పారిశుద్ధ్య కార్మికుల జీతాలు

**సిద్దిపేట పవర్**

సిద్దిపేట, మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం ఇండ్లు, భూములు ఇచ్చిన వారికి ఇప్పుడు సరి కొత్త సమస్య వచ్చి పడింది. మల్లన్నసాగర్‌లో ముంపునకు గురైన ఏడు గ్రామాలను డీ నోటిఫై చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం.. వాటిని అటు గజ్వేల్ మండలంగానీ, ఇటు మున్సిపాలిటీలోగానీ విలీనం చేస్తున్నట్లు ఆర్డర్స్ ఇవ్వలేదు. దీంతో స్టూడెంట్లకు క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు అందకపోగా.. ఇన్నాళ్లూ పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రావడం లేదు. వాటి కోసం ఎవరిని కలిసినా తమకు ఎలాంటి ఆర్డర్స్ అందలేదని చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**ఏడు గ్రామాలు డీనోటిఫై**

మల్లన్నసాగర్ నిర్మాణంతో తొగుట మండలంలోని వేములఘాట్, బ్రాహ్మణ బంజేరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, ఏటిగడ్డ కిష్టాపూర్, కొండపాక మండలంలోని సింగారం, ఎర్రవల్లి గ్రామాలు ముంపుకు గురయ్యాయి. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్ వద్ద ఆర్అండ్ఆర్ కాలనీని నిర్మించి ముంపు గ్రామాల ప్రజలను నాలుగేండ్ల కింద అక్కడికి తరలించారు. అక్కడే ప్రైవేట్ భవనాల్లో గ్రామ పంచాయతీలను నిర్వహిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గతేడాది సెప్టెంబర్‌లో గ్రామ పంచాయతీల ఓటరు లిస్ట్‌ను విడుదల చేసిన ఆఫీసర్లు ముంపు గ్రామాల లిస్ట్‌లను పెండింగ్‌లో పెట్టారు. తర్వాత ఏడు ముంపు గ్రామాలను డీనోటిఫై చేస్తూ ఆర్డర్స్ జారీ చేశారు. అక్కడి పంచాయతీ కార్యదర్శులను సైతం మరో చోటికి బదిలీ చేశారు.

**సర్టిఫికెట్ల జారీలో సమస్యలు**

ముంపు గ్రామాలను డీ నోటిఫై చేయడంతో ఇక ఆ గ్రామాలు గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం అయినట్లేనని అందరూ భావించారు. దీంతో ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన కొందరు వ్యక్తులు బర్త్, డెత్, క్యాస్ట్. ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం గజ్వేల్ మున్సిపాలిటీకి వెళ్లడంతో వారికి చుక్కెదురైంది. ఆ గ్రామాలు మున్సిపాలిటీలో విలీనమైనట్లు ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో తాము సర్టిఫికెట్లు జారీ చేయలేమని మున్సిపల్ ఆఫీసర్లు చెప్పడంతో ప్రజలు అయోమయానికి గురయ్యారు. మరి కొన్ని రోజుల్లో విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుండడం, సర్టిఫికెట్లు ఎక్కడ తీసుకోవాలో తెలియకపోవడంతో స్టూడెంట్లు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ముంపు గ్రామాల్లోని ఈజీఎస్ కూలీల జాబ్ కార్డులు రద్దు కావడంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అనర్హులయ్యారు. ఇప్పుడు సర్టిఫికెట్ల జారీపై స్పష్టత లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**పెండింగ్‌లో పారిశుద్ధ్య కార్మికుల జీతాలు**

ముంపు గ్రామాల పరిధిలో పనిచేసిన గ్రామ పంచాయతీ కార్మికులకు ఐదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. పంచాయతీలను రద్దు చేసినప్పటికీ ఏడు గ్రామాల పరిధిలోని 40 మంది కార్మికులు ఆర్అండ్ఆర్ కాలనీలో పారిశుధ్య, నీటి సరఫరా పనులు చేస్తూనే వచ్చారు. ఒక్కో కార్మికుడికి నెలకు రూ. 8 వేల చొప్పున రావాల్సి ఉంది. గ్రామ పంచాయతీలు డీనోటిఫై కావడం, మున్సిపాలిటీలో కలిపినట్లు ఆర్డర్స్ రాకపోవడంతో జీతాలు పెండింగ్‌లో పడ్డాయి. ఐదు నెలలుగా జీతం అందకపోవడంతో కార్మికులు ఇటీవల పని మానేశారు. దీంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. విషయం తెలుసుకున్న గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నర్సయ్య హామీతో రెండు రోజుల కింద తిరిగి పారిశుద్ధ్య పనులు ప్రారంభించారు.



**ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు**

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలను గజ్వేల్ మున్సిపాలిటీలో విలీనం చేసినట్లు ఎలాంటీ ఆదేశాలు రాలేదు. ముంపు గ్రామాలను డీ నోటిఫై చేసినప్పటికీ... మున్సిపాలిటీలో విలీనం చేస్తున్నట్లు ప్రత్యేకంగా ఆర్డర్స్ రావాల్సి ఉంది. అలాంటివేవీ రాకపోవడంతో జనన, మరణ , క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు జారీ చేయడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

**గోల్కొండ నర్సయ్య, గజ్వేల్ మున్సిపల్ కమిషనర్**

**సర్టిఫికెట్ల కోసం పాట్లు పడుతున్నం**

గ్రామ పంచాయతీలను రద్దు చేయడంతో బర్త్, డెత్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికెట్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సర్టిఫికెట్ల కోసం మున్సిపల్ ఆఫీస్‌కు వెళ్తే మున్సిపాలిటీలో విలీనం చేసినట్టు ఆదేశాలు రాలేదని అంటున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండడంతో సర్టిఫికెట్లు ఎక్కడ తీసుకోవాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి ముంపు గ్రామ నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలి.

**– జి.కృష్ణ, పల్లెపహాడ్**

**జీతాలు ఎప్పుడిస్తరో తెలియట్లేదు**

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులకు ఐదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. జీతాలు రాకున్నా ఆయా కాలనీల్లో పారిశుధ్య పనులు చేస్తూ వచ్చాం. జీతాల గురించి ఎవరిని అడగాలో తెలియకపోవడంతో ఇటీవలే పనులు మానేశాం. మున్సిపల్ కమిషనర్ హామీ మేరకు ఇటీవల పనులు ప్రారంభించినా.. పెండింగ్ జీతాలు ఎవరు ఇస్తారో తెలియడం లేదు.

**– స్వామి, పంచాయతీ కార్మికుడు, పల్లెపహాడ్**

# వర్షా కాల ప్రణాళికకు సిద్ధం కావాలి..








- జలమండలి సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం..
- నాణ్యమైన నీటి సరఫరాకు చర్యలు..
- హాట్ స్పాట్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి..
- 300 గజాలకుపైగా ఉన్న నివాసాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి..
- బోర్డు ఆర్థిక పరిస్థితిపై ఆరా.. అండగా ఉంటామని వెల్లడి..

ముందస్తు వర్షాల నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ చర్యలు తీసుకుంటామని హైదరబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

తేదీ 28.05.2025 బుధవారం రోజున ఖైరతాబాద్లోని జలమండలి కార్యాలయంలో వర్షాకాల ప్రణాళిక 90 రోజుల కార్యచరణ, పురోగతిలో ఉన్న పలుప్రాజెక్టు పనులపై జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ఉన్నత అధికారులతో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో డైరెక్టర్లు మొదలుకుని క్షేత్రస్థాయి సిబ్బంది వరకు అంతా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తాగునీటి సరఫరా మరియు మురుగునీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేయడానికి శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. అలాగే సీవరేజ్ రహదారులపై సీవరేజ్ ఓవర్ ఫ్లో కాకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమయంలో కలుషిత నీరు సరఫరా అయ్యే అవకాశం ఉన్నందున తగిన మోతాదులో క్లోరిన్ ఉండేలాగా చూసుకోవాలని సూచించారు.

ఇప్పటికే జలమండలి, జీహెచ్ఎంసీ 146 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించిందని, వాటిని ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. జలమండలి అధికారులు, సిబ్బంది 90 రోజుల కార్యాచరణ విజయవంతం చేసి, సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులను 30 శాతం తగ్గించడంపై ఎండీతో సహా అందరినీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ 90 రోజుల ప్రణాళికలో చేపట్టిన ఇంకుడు గుంతల నిర్మాణం పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

గత ఏడాది వేసవిలో 40 వేల వినియోగదారులు అధికంగా ట్యాంకర్లు బుక్ చేసినట్టు తెలిపారు. ఆ ప్రాంతంలో సర్వే చేస్తే వారి ప్రాంగణంలో ఇంకుడు గుంతలు లేనట్లు గుర్తించామన్నారు. వారందరికీ ఇంకుడు గుంటలు ఉంటే భూగర్భ జలాలు పెరిగి ఈ దుస్థితి రాకపోయేదని అన్నారు. 16 వేల మందికి ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా నోటీసులు జారీచేసి చేసినట్టు మంత్రి తెలిపారు. ఓఆర్ఆర్ పరిధిలోని 300 గజాల పైన ఉన్న ప్రతీ ప్రాంగణంలో ఇంకుడు గుంతలు నిర్మించడానికి ప్రతిఒక్కరూ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో దానిపై ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జలమండలి ఆర్థిక పరిస్థితిపై ఆరాతీసిన మంత్రి రెవెన్యూ పెంచుకోవడానికి, నీటి వృధాను అరికట్టడానికి, లీకేజీలను అరికట్టడానికి, ప్రజలలో నీటి వృధా తగ్గించేలా అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అక్రమ నల్లా కనెక్షన్లపై కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన, వివిధ శాఖలనుంచి జలమండలికి రావాల్సిన బకాయిలపై ముఖ్య మంత్రితో మాట్లాడుతామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రభుత్వం బోర్డు తన కాళ్లమీద తాను నిలబడేలాగా అన్నీ రకాలుగా చేయుతనిస్తామని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం అందించే స్కీమ్లను వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.

హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందని.. దానికనుగుణంగా తాగునీరు, మురుగు నీటి శుద్ధిపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి అన్నారు. అందులో భాగంగా 7వేల కోట్లతో గోదావరి ఫేస్ 2,3 ప్రాజెక్టును పనులను చేపట్టిందని, మురుగునీటి శుద్ధికై 39 ఎస్టీపీలను నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి చెప్పారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రానున్న 30 ఏళ్ల వరకు నీటి అవసరాలకు భరోసా ఉంటుందని వివరించారు. ప్రజలకు నీటి సరఫరా, మురుగునీటి సమస్యలపై జలమండలి కస్టమర్కేర్ 155313 కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

అంతకుముందు జలమండలి ఎండీ అశోక్రెడ్డి, జలమండలిలో చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు, బోర్డులోని వివిధ విభాగాలు.. పనితీరు, హైదరాబాద్ నగరానికి సరఫరా చేస్తున్న వివిధ ప్రాజెక్టులు, ఎస్టీపీలు, రెవెన్యూ ఆదాయ వ్యయాలతోపాటు భవిష్యత్తు ప్రణాళికను ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

అలాగే 90 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి గౌవరనీయులైన శ్రీ. రేవంత్ రెడ్డి గారు 2024 అక్టోబర్ 2న (గాంధీ జయంతి) ప్రారంభించామని, నగరంలో దీర్ఘకాలికంగా ఉన్న మురుగునీటి సమస్యలతో పాటు రోజూవారీగా వచ్చే ఫిర్యాదులను సైతం తగ్గించడం, భూగర్భ జలాల పెరుగుదలకు ఇంకుడు గుంతలు నిర్మించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఒక్క రూపాయి అదనంగా ఖర్చు పెట్టకుండా, ఉన్న వనరులనే ఉపయోగించుకుంటూ చేస్తున్న ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందని వివరించారు. ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయడానికి బోర్డు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తోందని చెప్పారు. జీఐఎస్ ఆధారిత మొబైల్ యాప్తో పాటు ప్రత్యేకడాష్బోర్డ్ ఏర్పాటు చేసి ప్రధాన కార్యలయం నుంచే ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షిస్తున్నారు. మొత్తం 3600కిలో మీటర్ల మురుగునీటి పైపులైన్, 3 లక్షల మ్యాన్ హోళ్లలో వ్యర్థాల తొలగించి శుభ్రపర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. అయితే ఇప్పటివరకు 24650ప్రాంతాల్లో మొత్తం 3,261.84కి.మీ మురుగునీటి పైపులైన్లు, 2.54 లక్షల మ్యాన్హోళ్లలో డీసిల్టింగ్ చేసినట్టు వివరించారు. దీనివల్ల నగరంలో 30 శాతం సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు తగ్గినట్టు ఈ సందర్భంగా ఎండీ వివరించారు.

అలాగే ఈ 90 రోజుల ప్రత్యేక ప్రణాళికలో ఇంకుడు గుంతలను సైతం నిర్మించాలని జలమండలి సంకల్పించిందని అన్నారు. ఎండిపోయిన 58 బోర్వెల్ల చుట్టు 41 ఇంకుడు గుంతలను జలమండలి నిర్మించింది. వీటిని బోర్డు నిధులతో నిర్మించారని చెప్పారు. ఇవే కాకుండా.. 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ప్రాంగణం కలిగి ఇంకుడు గుంతలు లేని వినియోగదారులు వాటిని నిర్మించుకునేలా లక్ష్యం పెట్టుకున్నామని అన్నారు. అలాగే ఇంకుడు గుంతలు లేని వినియోగదారులకు.. వాటిని నిర్మించుకోవాలని నోటీసులు జారీ చేస్తున్నట్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు కావాల్సిన సహాయ సహకారాలను ఎన్జీవోలు ఇస్తున్నట్లు అన్నారు. జలమండలి ఇచ్చిన ప్రోత్సాహం, చేసిన మార్గదర్శకత్వంలో.. ఇప్పటిదాకా 102 మంది వినియోగదారులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకున్నట్లు వివరించారు. ఇవేకాకుండా వేసవి కార్యచరణ, వర్షాకాల కార్యచరణ ప్రణాళిక, కొత్త ప్రాజెక్టులు, పురోగతిలో ఉన్న ప్రాజెక్టులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ప్రాజెక్టులపై జలమండలి ఎండీ మంత్రికి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్రెడ్డి, కోర్సిటీ సీజీఎంలు, జీఎంలు, డీజీఎంలు, మేనేజర్లు, ట్రాన్స్మిషన్ అధికారులు పాల్గొన్నారు.